మహిళలకు రుణ సౌకర్యం కల్పించండి

- పరిశ్రమలకు కావాల్సిన భూములను త్వరగా కేటాయించాలి
- పోలింగ్ కేంద్రల్లో మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకోండి
- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులను ఆదేశించిన సీఎస్ డాక్టర్ జవహర్‌రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కర్నూలు(సెంట్రల్): జగనన్న కాలనీలలో నిర్మాణంలో ఉన్న ఇళ్ల పూర్తి కావడానికి స్వయంసహాయక సంఘాల్లో లబ్దిదారులైన మహిళలకు బ్యాంకుల నుంచి రుణాలను ఇప్పించేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన విజయవాడ నుంచి స్పందన అంశాలపై జిల్లా కలెక్టర్లు, జేసీలు, ఇతర ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసైన్‌మెంట్, చుక్కలు, షరతులతో కూడిన పట్టా భూములను నిషేధిత జాబితా 22ఏ నుంచి విముక్తి చేయాలన్నారు. మూడో విడత రీసర్వేలో స్టోన్ ప్లాంటేషన్‌ను త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పరిశ్రమలకు కావాల్సిన భూములను కేటాయించాలని ఆదేశించారు. సాధారణ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్ డాక్టర్ జి.సృజన, కలెక్టరేట్ నుంచి జేసీ నారపురెడ్డి మౌర్య, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, సీపీఓ హిమప్రభాకరరాజు, డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి, డీఎంహెచ్ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్య పాల్గొన్నారు.

రాష్ట్రానికి పెద్దాసుపత్రి ఆదర్శం



సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

కర్నూలు(హాస్పిటల్): అవయవ దానం, కిడ్నీ ఆపరేషన్ నిర్వహించి రాష్ట్రంలో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఆదర్శంగా నిలిచిందని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు దండు వీరయ్య మాదిగ అన్నారు. గురువారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డిని ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా వీరయ్య మాదిగ మాట్లాడుతూ గుండెకు సంబంధించిన వ్యాధులను ముందస్తుగా గుర్తించేందుకు యాంజియోగ్రామ్ పరీక్షలను ప్రజలకు విరివిగా చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ ఆసుపత్రికి మరిన్ని మౌలిక వసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. అవయవ దానానికి ముందుకు రావాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో నాయకులు ఆంజనేయ మాదిగ, ప్రతాప్ మాదిగ, బైరాపురం రాజు, పైగేరి మధు, దాసు, జయన్న, రాముడు, అభిలాష్, సుజాత, సుంకులమ్మ పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రజలే జగనన్న కుటుంబ సభ్యులు

- వెన్నుపోటు చంద్రబాబుకు షర్మిల వత్తాసు పలకడం బాధాకరం
- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్



కర్నూలు(టౌన్): వెన్నుపోటు చంద్రబాబుకు కాంగ్రెస్ నేత షర్మిల వత్తాసు పలకడం బాధాకరమని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ప్రజలే కుటుంబ సభ్యులని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబో స్ అన్నారు. గురువారం ఆయన తన స్వగృహంలో మాట్లాడుతూ వ్యక్తిగత రాజకీయ స్వార్థంతో షర్మిల మాట్లాడుతుందనే విషయం రాష్ట్ర ప్రజలందరికి తెలుసన్నారు. చంద్రబాబును ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. అవినీతి, అబద్ధాలు, వెన్నుపోటు రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్ చంద్రబాబుకు పావులుగా షర్మిల, పవన్ కళ్యాణ్ మారారన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను, మేనిఫెస్టోను 99 శాతం చిత్తశుద్ధితో అమలు చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రజలకు అపార విశ్వాసముందన్నారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిగా ఎన్నుకునేందుకు ప్రజలు నిర్ణయం తీసుకున్నారన్నారు.

హాకీ పోటీల లోగో ఆవిష్కరణ



లోగోను ఆవిష్కరిస్తున్న డాక్టర్ శంకర్ శర్మ

కర్నూలు (టౌన్): ఈనెల 10 నుంచి 12వ తేదీ వరకు స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి హాకీ సబ్ జూనియర్ పోటీల లోగోను గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్ శర్మ గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాకీ క్రీడలో భారతదేశానికి ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. హాకీ అనగానే మనకు ధ్యాన్ చంద్ గుర్తుకు వస్తారన్నారు. ధ్యాన్ చంద్‌ను స్ఫూర్తిగా తీసుకొని రాణించాలన్నారు. హాకీ సంఘం కర్నూలు ప్రధాన కార్యదర్శి దాసరి సుధీర్, ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు రామాంజనేయులు, ప్రవీణ్ పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



అక్రమ మద్యాన్ని చూపుతున్న ఎస్‌ఐ తిమ్మయ్య

నందవరం: మండలంలోని నాగలదిన్నె చెక్‌పోస్టు వద్ద కర్ణాటక మద్యంను స్వాధీనం చేసుకుని వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ తిమ్మయ్య తెలిపారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ మాట్లాడుతూ.. మండల పరిధిలోని కనకవీడు గ్రామానికి చెందిన మాల గిడ్డయ్య అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తుండగా నాగలదిన్నె చెక్‌పోస్టు వద్ద పోలీసులు పట్టుకున్నారు. నిందితుడి వద్ద నుంచి కర్ణాటక మద్యం 480 జాన్స్ ఒరిజినల్ ఛాయస్ డీలెక్స్ విస్కీ టెట్రా ప్యాకెట్ల (90 ఎంఎల్)ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెల్లడించారు. తనిఖీల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నైతిక విలువలు నేర్పేవే కళలు

- బాలోత్సవం ప్రారంభ వేడుకల్లో ఇన్‌చార్జ్ డీఈఓ శామ్యూల్ పాల్



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ డీఈవో శామ్యూల్ పాల్

కర్నూలు కల్చరల్: నైతిక విలువలు నేర్పేవే కళలని ఇన్‌చార్జ్ డీఈఓ శ్యామూల్ పాల్ అన్నారు. కర్నూలు బాలోత్సవం మూడవ పిల్లల పండుగ కార్యక్రమం నగర శివారులోని మాంటిస్సోరి ఇండస్ పాఠశాలలో ప్రారంభమైంది. ఇన్‌చార్జ్ డీఈఓ శామ్యూల్ పాల్, రవీంద్ర విద్యా సంస్థల అధినేత జి.పుల్లయ్య, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్యలు జ్యోతి ప్రజ్వలనతో వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి డీఈఓ మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదల, తపన ఉంటే ఏరంగంలోనైనా వంద శాతం విజయం సాధించవచ్చన్నారు. జ్ఞానం అందరిలో ఉంటుందని దానిని వెలికి తీయడమే ఉపాధ్యాయుల పని అన్నారు. సాంకేతికతను సరైన రీతిలో మాత్రమే వినియోగించుకోవాలన్నారు. జి.పుల్లయ్య మాట్లాడుతూ.. పట్టుదల, కృషి ఉంటే మనిషి ఏదైనా సాధించగలడన్నారు. పత్తి ఓబులయ్య మాట్లాడుతూ..అపజయాలు కూడా విజయాలు సాధించడానికి పునాది రాళ్లు అవుతాయన్నారు. ప్రైవేట్ విద్యా సంస్థల యాజమాన్యాల సంఘం జిల్లా అధ్యక్షుడు వాసుదేవయ్య, బాలోత్సవం అమరావతి కమిటీ ప్రధాన కార్యదర్శి పిన్నమనేని మురళీకృష్ణ, బాలోత్సవం కమిటీ అధ్యక్షుడు బడేసాహెబ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి కెంగార మోహన్, ప్రధాన కార్యదర్శి జేఎస్ శేషయ్య మాట్లాడారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో రవీంద్ర టాలెంట్ స్కూల్ కరస్పాండెంట్ పీబీవీ సుబ్బయ్య, జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు సుధీర్‌రాజు, కార్యదర్శి ఖాజా హుసేన్, సమత కన్వీనర్ రమాదేవి, యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు సురేష్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్ పాల్గొన్నారు.



విద్యార్థిని నృత్య ప్రదర్శన

లోక్ అదాలత్‌లో కేసుల సత్వర పరిష్కారం

కర్నూలు (లీగల్): ప్రజా వినియోగసేవలకు సంబంధించి ఏవైనా కేసులు ఉంటే శాశ్వత లోక్ అదాలత్‌ను సంప్రదించి ఖర్చు లేకుండా, త్వరగా పరిష్కరించుకోవచ్చని ప్రజా వినియోగ సేవల శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షులు ఎం.వెంకటహరినాథ్ సూచించారు. గురువారం శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షులు ఎం.వెంకటహరినాథ్, సభ్యులు టి.శివశంకర్‌రెడ్డి, డి.రాజుబాబు ఆధ్వర్యంలో రెండు కేసులను పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీ కాదల్చుకున్న వారెవరైనా లోక్ అదాలత్‌ను సంప్రదించాలన్నారు.

ప్రతిభ ద్వారానే ఎంపిక

- సాయి హాస్టల్ తైక్వాండో కోచ్ కార్తికేయన్



ఎంపిక పోటీలను పరిశీలిస్తున్న కోచ్ కార్తికేయన్

కర్నూలు (టౌన్): క్రీడాకారుల్లో ప్రతిభ ఉంటేనే ఎంపిక అవుతారని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా తైక్వాండో కోచ్ కార్తికేయన్ అన్నారు. గురువారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో తైక్వాండో ఎంపిక పోటీలు నిర్వహించారు. అండర్ 12, అండర్ 17 విభాగాల్లో నిర్వహించిన ఈ పోటీలను బెంగళూరుకు చెందిన సాయి స్పోర్ట్స్ హాస్టల్ ఇన్‌చార్జ్ గౌతమ్ సింగ్ వర్థి పరిశీలించారు. ఈ సందర్భంగా తైక్వాండో కోచ్ మాట్లాడుతూ ఒలింపిక్ సంఘం గుర్తించిన తైక్వాండో వంటి మార్షల్ ఆర్ట్స్‌లో రాణిస్తే విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో కర్నూలు స్పోర్ట్స్ హాస్టల్ ఇన్‌చార్జ్ చంద్రశేఖర్, ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి చంద్రమౌళి పాల్గొన్నారు.

రగ్బీలో కేజీబీవీ విద్యార్థినుల ప్రతిభ

మిడుతూరు: రగ్బీ రాష్ట్రస్థాయి క్రీడల్లో స్థానిక కస్తూర్బా బాలికల విద్యాలయం విద్యార్థినులు ప్రతిభ కనబరిచినట్లు కేజీబీవీ ఎస్ఓ విజయలక్ష్మి తెలిపారు. గురువారం ఎస్ఓ మాట్లాడుతూ రగ్బీ అసోసియేషన్ ఆఫ్ ఏపీ 9 ఇంటర్ డిస్ట్రిక్ట్ చాంపియన్ షిప్ ఈనెల 2 నుంచి 4వ తేదీ వరకు విశాఖపట్టణం జీవీఎంసీ ఫుట్‌బాల్ స్టేడియంలో జరిగిందన్నారు. ఇందులో స్థానిక కేజీబీవీ ఎనిమిదో తరగతి విద్యార్థినులు శృతి, అక్షయ జిల్లా జట్టు తరపున పాల్గొని.. ప్రతిభ చూపి విజయానికి దోహదపడ్డారన్నారు. వీరిలో అక్షయ అనే విద్యార్థిని జాతీయ స్థాయికి ఎంపికై నట్లు వెల్లడించారు. జాతీయ స్థాయికి విద్యార్థిని గుజరాత్‌లోని గాంధీనగర్ నిర్వహించే నేషనల్ మీట్‌లో పాల్గొంటుందని తెలిపారు. రగ్బీ క్రీడలో శిక్షణ ఇచ్చిన పీఈటీ సుమలతను, విద్యార్థినులను ప్రత్యేకంగా అభినందించారు.

ప్రభుత్వ వైద్య కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి

- జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కర్నూలు (అర్బన్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న సురక్ష, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ, తదితర కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని జిల్లాపరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి సూచించారు. జిల్లాకు కొత్తగా వచ్చిన ఎంపీడీఓలతో గురువారం సాయంత్రం స్థానిక జిల్లాపరిషత్ మినీ సమావేశ భవనంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ జగనన్న ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్‌పై ఎంపీడీఓలు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని తమ మండలాల పరిధిలో ఎక్కడా తాగునీటి సమస్య రాకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. మరమ్మతులకు గురైన చేతి పంపులను గుర్తించి అవసరమైన పరికరాలను కొనుగోలు చేసి వాటిని ఉపయోగంలోకి తీసుకురావాలన్నారు. గ్రామ సచివాలయాల ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాలు లబ్ధిదారుని ఇంటికి వేరే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. జెడ్పీ సీఈఓ జి.నాసరరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో బదిలీపై వచ్చిన ఎంపీడీఓలందరూ క్షేత్ర స్థాయిలో మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్‌ను సమర్థవంతంగా నిర్వర్తించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. సమావేశంలో జెడ్పీ డిప్యూటీ సీఈఓ ఇ.వి.సుబ్బారెడ్డి, కర్నూలు, ఆదోని డీఎల్‌డీఓలు బాలకృష్ణారెడ్డి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు



సోమలగూడూరులో గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎస్పీ సీతారామయ్య

నందవరం: గ్రామాల్లో ప్రశాంతతకు భంగం కలిగించేలా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ సీతారామయ్య హెచ్చరించారు. గురువారం మండల పరిధిలోని టి.సోమలగూడూరు గ్రామంలో సీఐ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులతో డీఎస్పీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. అల్లర్లకు పాల్పడకుండా శాంతియుతంగా జీవించాలని గ్రామస్తులకు సూచించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేలా ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. ఎన్నికల వేళ అల్లర్లు, గొడవలకు పాల్పడితే శిక్ష తప్పదన్నారు. ఎస్‌ఐ తిమ్మయ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఇస్కాన్ టెంపుల్‌కు స్థలం కేటాయింపు

కర్నూలు కల్చరల్: ఇస్కాన్ టెంపుల్ నిర్మాణానికి స్థలం లీజుకు ఇస్తూ దేవదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. కర్నూలు నగరంలో ఇస్కాన్ ఆలయ నిర్మాణానికి దేవదాయ శాఖ స్థలం కేటాయించాలని ఇస్కాన్ నిర్వాహకులు కోరారు. వారి వినతి మేరకు దేవదాయ శాఖ వారు కల్లూరు మండలం లక్ష్మీపురం గ్రామం శ్రీ జగన్నాథ స్వామి ఆలయానికి సంబంధించిన భూమి దూపాడు గ్రామ పంచాయతీ సర్వే నం. 60/1లో ఉన్న 6.23 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. 11 సంవత్సరాలు లీజుకు ఇస్తూ సంవత్సరానికి ఎకరాకు రూ.30 వేలు అద్దె చెల్లించాలని, ప్రతి మూడేళ్లకోసారి 33 శాతం అదనంగా అద్దె పెరుగుతుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇస్కాన్ ఆలయ నిర్మాణానికి మాత్రమే స్థలాన్ని వినియోగించుకోవాలని అందులో పొందుపరిచారు.

పెరిగిన బుగ్గరామేశ్వరుని హుండీ ఆదాయం



హుండీ లెక్కింపులో పాల్గొన్న మహిళలు

ఓర్వకల్లు: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కాల్వబుగ్గలోని బుగ్గరామేశ్వరుని హుండీ ఆదాయం పెరిగినట్లు ఈఓ డీఆర్‌కేవీ ప్రసాద్ తెలిపారు. గురువారం కాల్వబుగ్గ దేవస్థానంలో స్వాములవారి హుండీ కానుకలను లెక్కింపు చేపట్టారు. దేవదాయ, ధర్మదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి సమక్షంలో చేపట్టిన లెక్కింపులో గతేడాది ఐదు నెలలకు గాను రూ.4,14,444లు కానుకలు రాగా, ఈ ఏడాది ఎనిమిది నెలలకు సంబంధించి రూ.6,37,414 వచ్చినట్లు వెల్లడించారు. గతేడాదితో పోల్చితే ఈ ఏడాది రూ.1,39,405 అదనంగా ఆదాయం వచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కర్నూలు బాలాజీ సేవా ట్రస్టు బృందం సభ్యులు, హుసేనాపురం ఏపీజీబీ బ్రాంచ్ మేనేజర్ శివకృష్ణ, ధర్మకర్త మండలి సభ్యులు నాగశేషయ్య, వెంకటేశ్వరమ్మ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

టైర్ల చోరీపై కేసు నమోదు

కృష్ణగిరి: మండల పరిధిలోని కంబాలపాడు గ్రామ శివారులో వైఎస్సార్ సుజల స్రవంతి మదర్ ప్లాంటు వద్ద ట్రాక్టర్ల టైర్లు చోరీ కావడంపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. గతేడాది డిసెంబర్ 30న రాత్రి మదర్ ప్లాంటు వద్ద ఉన్న నాలుగు ట్రాక్టర్లలో మూడు ట్రాక్టర్లకు సంబంధించి ఆరు టైర్లను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసిన విషయం విధితమే. ఇందుకు సంబంధించి చుట్టు గ్రామాల్లో విచారించిన ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హరినాథ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఆయన తెలిపారు.

వ్యక్తికి గాయాలు

జూపాడుబంగ్లా: మండలకేంద్రానికి చెందిన మహబూబ్‌బాషాకు గురువారం తెల్లవారుజామున బొలెరో వాహనం ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. తెల్లవారుజామున మసీదుకు వెళ్లి ఇంటికి తిరిగి వెళ్తున్న మహబూబ్‌బాషాను వెనుక నుంచి గుర్తుతెలియని బొలెరో వాహనం ఢీకొంది. గాయాలపాలైన అతన్ని చికిత్స నిమిత్తం హుటాహుటినా కర్నూలు ఆసుపత్రికి తరలించారు. బాధితుని బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు గుర్తుతెలియని వాహనం ఆచూకీ కోసం యత్నిస్తున్నట్లు ఏఎస్‌ఐ మేరీ జయంతి తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య



శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంట గ్రామ సమీపంలోని మోకాళ్లకురువ అటవీ ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు సీఐ రమేష్‌కుమార్ గురువారం తెలిపారు. సుమారు 50 సంవత్సరాల వయసు కలిగిన వ్యక్తి బుధవారం విషపూరిత ద్రావకాన్ని సేవించి ఆత్మహత్యకు పాల్పడినట్లు భావిస్తున్నట్లు చెప్పారు. మృతుడు ఎరుపు రంగు టీషర్ట్, ఆకుపచ్చ ప్యాంటు ధరించాడని తెలిపారు. మృతదేశాన్ని సున్నిపెంట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి శవపరీక్షలు నిర్వహించామని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. మృతునికి సంబంధించి వివరాలు తెలిసిన వారు.. టూటౌన్ ఎస్‌ఐ సెల్ 9121101194కు సమాచారం ఇవ్వాలని కోరారు.

వరిగడ్డి ట్రాక్టర్ దగ్ధం

ఆదోనిరూరల్: ఆదోని పట్టణశివారు ప్రాంతంలో దాదాపీర్ ఫ్యాక్టరీ సమీపంలో గురువారం ట్రాక్టర్‌లో వరిగడ్డిని తరలిస్తుండగా అగ్ని రవ్వలు పడి వరిగడ్డి పూర్తిగా దగ్ధమయ్యింది. వివరాల్లోకి వెళితే.. సంతెకూడ్లూరు గ్రామానికి చెందిన మలిగప్ప కురుకుంద గ్రామానికి పశువుల మేత కోసం వరిగడ్డిని తన బంధువులకు ట్రాక్టర్‌లో తరలిస్తున్నాడు. ఫ్యాక్టరీ సమీపంలో చెత్తను తగలబెట్టిన నిప్పురవ్వలు పడి వరిగడ్డికి నిప్పంటుకుంది. డ్రైవర్ ట్రాలీని వదిలి వెళ్లడంతో గడ్డితో పాటు ట్రాలీ పాక్షికంగా దగ్ధమైంది. ఈ సంవత్సరం వర్షాలు సరైన సమయంలో పడకపోవడంతో ఉన్న కాస్త మేతను తరలిస్తుండగా మార్గ మధ్యలో ఇలా జరిగిందని బాధిత రైతు వాపోయాడు. ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందించాలని రైతు కోరుతున్నాడు.

క్లుప్తంగా

గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న పి.రామచంద్రయ్య

కర్నూలు(సెంట్రల్): కేంద్ర కార్మిక సంఘాలు, జాతీయ కిసాన్ మోర్చా, రైతు సంఘాలు ఉమ్మడిగా ఈ నెల 16న తలపెట్టిన గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని ఏపీరైతు సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు పి.రామచంద్రయ్య కోరారు. గురువారం సీపీఐ కార్యాలయంలో ఏఐకేఎస్ జిల్లా కార్యదర్శి పంపన్నగౌడ్ అధ్యక్షతన నిర్వహించిన సంయుక్త సమావేశానికి ఏఐకేఎస్ రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప, ఎస్టీయూ జిల్లా కార్యదర్శి అఖండ, రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘంజిల్లా కార్యదర్శి కేవీ నారాయణ హాజరయ్యారు. ఈసందర్భంగా రామచంద్రయ్య మాట్లాడుతూ 16న చేపట్టే గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని రైతులు, రైతు కూలీలను కోరారు.

ఉపాధ్యాయ ఖాళీలన్నింటిని భర్తీ చేయాలి

కర్నూలు(సెంట్రల్): ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులన్నింటినీ భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్రబాబు డిమాండ్ చేశారు. గురువారం ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మెగా డీఎస్సీలో 25 వేల పోస్టుల భర్తీ కోసం రీ నోటిఫికేషన్‌ను విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, కారుమంచి పాల్గొన్నారు.

రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేయాలి

కర్నూలు(సెంట్రల్): తీవ్ర కరువు, తుఫాన్లతో నష్టపోయిన రైతన్నలను ఆదుకోవడానికి రూ.2 లక్షల రుణమాఫీ చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని ఏపీ రైతుసంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు పి.రామచంద్రయ్య డిమాండ్ చేశారు. గురువారం ఏపీ రైతుసంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో రైతులకు ఎన్నో హామీలు ఇచ్చిన ప్రభుత్వాలు సక్రమంగా అమలు చేయలేదన్నారు. కరువు నెలకొన్న నేపథ్యంలో అప్పులపాలవుతున్న అన్నదాతలను ఆదుకోవడానికి రూ.2 లక్షల రుణమాఫీ చేస్తే మంచిదన్నారు. ఈవిషయంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీ రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం, జిల్లా కార్యదర్శి పంపన్నగౌడ్ పాల్గొన్నారు.

రవాణా రంగ సమ్మెను జయప్రదం చేయండి

కర్నూలు(సెంట్రల్): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ విధానాలతో రవాణా రంగాన్ని కుదేలు చేయడానికి పూనుకున్న నేపథ్యంలో ఈనెల 16న దేశవ్యాప్తంగా రవాణా సమ్మె కు పిలుపు ఇచ్చినట్లు ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్(ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్) జిల్లా కార్యదర్శి కె.ప్రభాకర్ తెలిపారు. గురువారం కార్బైడ్ ఫ్యాక్టరీ ఆవరణలో ఏర్పాటు చేసిన లాంగ్ లారీ ఓనర్స్ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. హిట్ అండ్ రన్ చట్టంతో డ్రైవర్లను జైళ్లకు పంపేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందన్నారు. దీనిని తీవ్రంగా వ్యతిరేకించాల్సి ఉందన్నారు. లేదంటే భవిష్యత్‌లో రవాణా రంగం మూతపడే ప్రమాదం ఉందన్నారు. 16న జరిగే రవాణా రంగ సమ్మెను విజయవంతంచేసేందుకు ప్రతి కార్మికుడు కృషి చేయాలన్నారు. సమావేశంలో నాయకులు గంగాధర్, ఎస్.వలి పాల్గొన్నారు.

10న ఎస్టీయూ జిల్లా కార్యవర్గ సమావేశం

కర్నూలు సిటీ: ఎస్టీయూ జిల్లా ప్రథమ కార్యవర్గ సమావేశం ఈ నెల 10న సలాంఖాన్ భవనంలో నిర్వహించనున్నట్లు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.గోకారి, టి.కె జనార్దన్ గురువారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. సమావేశానికి సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు సాయిశ్రీనివాస్, తిమ్మన్న హాజరు కానున్నారన్నారు. సమావేశానికి ఎస్టీయూ కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి రావాలన్నారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

కర్నూలు(లీగల్): జిల్లాన్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి నాగభూషణం నాయుడు, చక్రపాణి గురువారం తెలిపారు. అమీలియో హాస్పిటల్ వైద్యుల సహకారంతో న్యాయవాదుల కు,న్యాయశాఖ సిబ్బందికి, న్యాయవాద గుమాస్తాలకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

కేసీ కాల్వకు నీటి విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కర్నూలు ప్రజల తాగు నీటి అవసరాల కోసం కేసీ కాల్వకు గురువారం 159 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు డ్యాం అధికారులు తెలిపారు. డ్యాంలో 0.358 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు వారు పేర్కొన్నారు.



రోగుల సహాయకుల వినూత్న ఆలోచన

కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగుల సహాయకులు వినూత్న ఆలోచన చేశారు. వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు దోమతెరలు ఏర్పాటు చేసుకుని వాటిలో సేదదీరుతున్నారు. కాలుష్య కారకాల నుంచి, క్రిమికీటకాల నుంచి తమను తాము రక్షించుకుంటున్నారు.

– సాక్షిఫొటోగ్రాఫర్, కర్నూలు

